క్లుప్తంగా

ప్రమాదకరంగా భారీ వృక్షం



ఎల్బీచర్లలో ఎండిపోయి ప్రమాదకరంగా ఉన్న భారీ వృక్షం

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్బీచర్ల మేజర్ పరిధిలోని కాలువను ఆనుకుని ఉన్న ఓ భారీ నిద్రగన్నేరు వృక్షం ఎండిపోయి కూలడానికి సిద్ధంగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి పక్కనే ఎండిన వృక్షం ఉంది. సమీపంలో జిల్లా పరిషత్ హైస్కూల్ ఉండటంతో విద్యార్థులంతా ఈ మార్గం మీదుగానే స్కూల్‌కు వెళ్తుంటారు. ఎండిన వృక్షం ఏ క్షణాన కూలి పక్కనే ఉన్న విద్యుత్ వైర్లపై పడుతుందోనని సమీపంలోని పంట చేలకు వెళ్లే రైతు కూలీలు ఆందోళన చెందుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి ఈ వృక్షాన్ని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రైవేట్ కళాశాలల అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా బ్రహ్మాజీ



బ్రహ్మాజీని సత్కరిస్తున్న దృశ్యం

నరసాపురం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా నరసాపురం శ్రీ సూర్యా విద్యాసంస్థల అధినేత ఘంటశాల బ్రహ్మాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం రాజమండ్రిలో నిర్వహించిన బ్రహ్మాజీను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీని ప్రైయివేట్ కళాశాలల యాజమాన్యాల సభ్యులు సత్కరించారు. బ్రహ్మాజీని సత్కరించిన వారిలో వివిధ ప్రైయివేట్ కళాశాలల కరస్పాండెంట్లు ఆదిత్య శేషారెడ్డి, ఎంవీ నర్సింహరావు, విశ్వేశ్వరరెడ్డి ఉన్నారు.

టేలర్‌పేట హైస్కూల్ తనిఖీ



టేలర్‌పేట మున్సిపల్ పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

నరసాపురం: పట్టణంలోని టేలర్‌పేట మున్సిపల్ స్కూల్‌ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఆకస్మికంగా ఎం.అంజయ్య తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యాబోధన జరుగుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విద్యాబోధన పాఠశాలలో సవ్యంగా సాగాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. పాఠశాల వద్ద పారిశుద్ధ్య ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎవరైనా విద్యార్థులు పాఠశాలకు రావడం మానేస్తే తల్లితండ్రులతో మాట్లాడాలని, చదువులు మానిపిస్తే వారికి కౌన్సిలింగ్ ఇచ్చి తిరిగి పాఠశాలకు పంపేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఎంకు సూచించారు.

టెలీ కాలింగ్ ద్వారా ఉచిత హోమియో వైద్యం



వైద్య పరీక్షలు చేస్తున్న శ్రీరామకృష్ణ పరమహంస హోమియోపతి ఆస్పత్రి సిబ్బంది

యలమంచిలి: పాలకొల్లు పట్టణానికి చెందిన శ్రీరామకృష్ణ పరమహంస హోమియోపతి హాస్పటల్ వైద్యులు డాక్టర్ కోసూరి రామకృష్ణానందరాజు (పోడూరు రాజు) టెలి కాలింగ్ ద్వారా ఉచిత హోమియో వైద్య సేవలు అందించారు. ఆసుపత్రి సిబ్బంది కంచుస్తంభంపాలెం సెంటర్లో మంగళవారం హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి వచ్చిన రోగులకు సిబ్బంది బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. అనంతరం ఫోన్‌లో వారి ఆరోగ్య ఇబ్బందులను డాక్టర్‌కు చెప్పించారు. టెలీ కాలింగ్ ద్వారా 23 మంది రోగుల వ్యాధులను తెలుసుకున్న డాక్టర్ దీర్ఘకాలిక వ్యాధులకు సైతం తగిన సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం డాక్టర్ సిఫారసు మేరకు రోగులకు ఉచితంగా హోమియో పిల్స్ అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనుగొండ: మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్వహణవలన బుధవారం విద్యుత్ సరఫరకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కె.మధుకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకూ సరఫరా నిలిచిపోతుందని వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

చేనేతకు చేయూత కరువు

- అప్పుల ఊబిలో కూరుకుపోతున్న నేతన్నలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



వడలిలో పడుగు పడుతున్న మహిళలు



కుటుంబం మొత్తం చేనేత పని చేస్తున్న దృశ్యం



ఆచంట వేమవరంలో మగ్గం నేస్తున్న నేతన్న

పెనుగొండ: నేతన్నలు రోజురోజుకూ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. చేనేతలను ఆదుకుంటామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ గాలిలో కలిసిపోయాయి. చేనేతలకు అండగా ఉండడానికి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో అమలు చేసిన నేతన్న నేస్తం నిలిచిపోవడంతో మగ్గాలు నిలిచిపోతున్నాయి. ఆచంట నియోజకవర్గంలో పెనుగొండ, ఆచంట, పోడూరు మండలాల్లో సుమారు 258 మంది కుటుంబాలు చేనేతపై ఆధారపడి జీవిస్తున్నాయి. గతంలో వీరిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ నేతన్న నేస్తం రూ.24 వేలు సాయం ప్రతి ఏటా అందించారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా కాలయాపన చేస్తూ వాయిదా వేస్తూ వస్తుంది. ప్రభుత్వం తరపున అందించాల్సిన సాయంపై మొండి చేయి చూపినా, ఇతర చేనేత అభివృద్ధి పథకాలను అమలు చేయడంలో సరైన చర్యలు తీసుకోకపోవడంతో నేతన్నలు డీలా పడిపోతున్నారు.

పెరగుతున్న ముడిసరుకు ధరలు

పెరిగిపోతున్న ముడిసరుకుల ధరలతో గిట్టుబాటు ధర లేక నానావస్థలు పడుతున్నారు. కుటుంబం యావత్తు చేనేతపై ఆధార పడి పనిచేస్తున్నా కుటుంబం గడిచే పరిస్థితి లేక మగ్గాలు మూసుకుని ఇతర రంగాలవైపు మళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర రంగాల్లో సరైన అనుభవం లేక కూలీలుగా చేరాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. నూలు, సిల్క్ వంటి ముడిసరుకులపై 50 శాతంకు పైగా సబ్సిడీ, చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ 250 యూనిట్లు వరకూ ఇవ్వడం, చేనేత రంగంలో పనిచేస్తున్న మహిళలకు ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయడం, చేనేత కార్మికులకు రూ.5 లక్షల వరకూ వడ్డీలేని రుణాలు అందించి ఆదుకోవడంతో పాటు, ప్రతి నియోజకవర్గంలోనూ చేనేత బజార్లు ఏర్పాటు చేయడం ద్వారా చేనేత ఉత్పత్తులకు ప్రోత్సాహాన్ని అందించి ఆదుకోవాలంటూ వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేతన్న నేస్తం కొనసాగించాలి



నేతన్న నేస్తం రూ.24 వేలు కొనసాగించాలి. చేతి నిండా పని కల్పించాలి, చేసిన పనికి గిట్టుబాటు మజూరి అందేలా చూడాలి. సొసైటీలకు క్యాష్ క్రెడిట్ పద్ధతి రద్దు చేసి నష్టాల్లో ఉన్న చేనేత సొసైటీలను ఆదుకోవాలి. రద్దు చేసిన చేనేత మండలిని పునరుద్ధరించాలి. ఆర్ఆర్ఆర్ లాంటి ప్రథకాలను ప్రవేశ పెట్టాలి. చేనేత కులాలకు విద్యా వైద్య, రాజకీయ రంగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలి.

– అల్లాడి సూర్యభాస్కరరావు, ఏపీ దేవాంగ అభ్యుదయ సేవా సంఘం రాష్ట్ర ప్రతినిధి

చేనేత కుటుంబాలను ఆదుకోవాలి



ఒకప్పుడు రాష్ట్రానికే తలమానికంగా నిలిచిన చేనేత రంగాన్ని ఆదుకోవాలి. చేనేత కుటుంబాలకు అండగా నిలవాలి. ప్రతి నియోజకవర్గంలోనూ చేనేత బజార్లు ఏర్పాటు చేయడంతో పాటు ముడి సరుకులపై సబ్సిడి ఇచ్చి అండగా నిలిస్తే తప్ప చేనేత కుటుంబాలకు మనుగడ లేదు. ఉచిత విద్యుత్ అందించాలి. అర్హులైన అందరికీ ప్రత్యేక పథకాలు అమలు చేయాలి.

– అందే కోటి లింగం, నేతన్న, ఆచంట వేమవరం

నేడు ప్రజా ప్రతినిధులకు అవగాహన సదస్సులు

నరసాపురం రూరల్: గ్రామాభివృద్ధి సూచికల విషయమై స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు బుధవారం ఒక్కరోజు అవగాహనా సదస్సును నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గాదిరాజు రామకృష్ణంరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మండలంలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీ, సర్పంచ్‌లకు ఈ సదస్సులో పలు విషయాలపై అవగాహన కలిస్తారని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులంతా విధిగా ఈ సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

వైభవంగా మాస శివరాత్రి పూజలు



ప్రత్యేక అలంకరణలో శివపరమాత్ముడు

యలమంచిలి: మాస శివరాత్రి సందర్భంగా మంగళవారం మేడపాడు శివాలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు బాదంపూడి సత్యనారాయణమూర్తి, బాదంపూడి చిరంజీవిశర్మలు ఉదయం శివునికి అభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అభిషేకం అనంతరం శివలింగానికి ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేశారు. పూజ అనంతరం భక్తులకు ఆశీర్వచనం, ప్రసాద వితరణ చేశారు.

మద్యం షాపుల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

నరసాపురం: గీత కులాల వారికి మద్యం షాపులు కేటాయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా నరసాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మూడు షాపులు ఇవ్వనున్నట్లు ఎక్సైజ్ సీఐ యస్ రాంబాబు చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నరసాపురం పట్టణంలో ఒకటి, రూరల్ మండలంలో ఒకటి, మొగల్తూరు మండలంలో ఒకటి కేటాయించారని చెప్పారు. గీత కులాలకు చెందిన ఆసక్తి కలిగిన వారు ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో గానీ, ఆఫ్‌లైన్‌లో గాని దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.2 లక్షల నాన్ రిఫండబుల్ నగదు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ అందించాలని చెప్పారు. 7న జిల్లా కలెక్టర్ డ్రా తీసి షాపులు కేటాయిస్తారని చెప్పారు.

బాపూజీపురం వాసుల ఇబ్బందులు తొలగించాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: పెనుగొండ బాపూజీ పురంలోని దళితులు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, సత్వరం పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దారు జి.అనితకుమారికి వినతి పత్రం సమర్పించారు. ఇంటి స్థలాలు లేక ఇరుకు షెడ్లలో నివాసం ఉంటున్నారన్నారు. వారికి ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రతి నెలా 104 వచ్చే ఏర్పాటు చేయాలని, రేషన్ వాహనం వచ్చేలా చర్యలు తీసుకోవాలని, రహదారులు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాదాసు నాగేశ్వరరావు, బాపూజీపురం వాసులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ శుభ్ర పరచాలి

చెరుకువాడలోని చర్చి వద్ద డ్రెయినేజీని శుభ్రపరచాలని మండల కార్యదర్శి షేక్ పాదుషా డిమాండ్ చేశారు. డ్రెయినేజీ శుభ్రపరచకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారాన్నరు. సత్వరం అధికారులు స్పందించి శుభ్రపరచాలని కోరారు.

పశుగ్రాసం పెంచుకోవడానికి తోడ్పాటు

పెనుగొండ: పశు సంపద వృద్ధి కోసం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మేలు రకం పశు గ్రాసం పెంపకానికి తోడ్పాటును అందిస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ ఏడీఏ డాక్టర్ ప్రమీలా రాణి అన్నారు. మంగళవారం పెనుగొండ జిలంచెరువులో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరంలో పాల్గొన్నారు. పశుగ్రా స క్షేత్రాల అభివృద్ధికి చిన్న సన్న కారు రైతులకు 10 నుంచి 50 సెంట్లు వరకూ పెంచుకోవడానికి ప్రభుత్వం వీలు కల్పిస్తుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ, పిల్లి విష్ణు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రావిపాడులో

పోడూరు: పశువులకు డీవార్మింగ్ చేయించి సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పాలకొల్లు వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పెన్మెత్స రామభద్రరాజు సూచించారు. రావిపాడులో మంగళవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సర్పంచ్ పెన్మెత్స విజయలక్ష్మి అధ్యక్షతన ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని రామభద్రరాజు ప్రారంభించి మాట్లాడారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిబిరాలని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. శిబిరంలో పాల్గొన్న 30 పశువులకు వెటర్నరీ ఏడీ డాక్టర్ పి.జయకర్ ఆధ్వర్యంలో వెటర్నరీ సిబ్బంది వైద్యపరీక్షలు నిర్వహించారు. లేగదూడలకు, కోళ్లకు డీవార్మింగ్ మందు వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.మహేష్‌కుమార్, వీఎల్ఓ బి.శ్రీను, గోపాలమిత్రలు సుబ్బారావు, మూర్తి, వెటర్నరీ సిబ్బంది మనీషా, బాబు, విజయ్, నాగలక్ష్మి, జ్యోతికుమార్, నాగేంద్ర, యామిని తదితరులు పాల్గొన్నారు.



పెనుగొండ: జిలంచెరువులో పశు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రమీలారాణి



పోడూరు: రావిపాడులో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహిస్తున్న వెటర్నరీ సిబ్బంది

పశు సంరక్షణకు ప్రాధాన్యత



యలమంచిలి: చించినాడలో మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

యలమంచిలి: పాడి రైతులంతా పశువుల సంరక్షణకు ప్రాధాన్యత ఇచ్చి పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని చించినాడ సర్పంచ్ దంగేటి రాజమణి కోరారు. చించినాడ, శిరగాలపల్లి గ్రామాలలో మంగళవారం పశు వైద్య శిబిరాలు జరిగాయి. చించినాడ శిబిరాన్ని ఎంపీటీసీ సభ్యురాలు నల్లి సంధ్యారాణితో కలిసి రాజమణి ప్రారంభించారు. శిరగాలపల్లిలో శిబిరాన్ని ఇన్‌చార్జి సర్పంచ్ పైడి చంద్రపాలు ప్రారంభించారు. ఈ శిబిరాల్లో మండల పశు వైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది 76 పశువులకు వివిధ రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. శిబిర నిర్వహణకు పశు సంవర్ధక సహాయకులు జాజిత, జాజిమొగ్గల హేమలత, నిల్లా కోట సత్యశ్రీ, సతీష్, షబీర, తరుణ్, దుర్గా భవాని, దొరబాబు, వెంకన్న బాబు, జగన్నాథరావు, సునంద సహకరించారు.

బీజేపీకి దళితులు గుణపాఠం చెప్పడం ఖాయం



సీహెచ్.మంగరాజు

పోడూరు: దళితుల మధ్య విభేదాలు సృష్టించి లబ్ధి పొందాలని చూస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో దళితులంతా కలసి తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు సీహెచ్ మంగరాజు అన్నారు. కవిటం శివారు పాటిమీద మంగళవారం ఆయన మాల మహానాడు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయన పాటిమీద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ దేశంలో అంబేద్కర్ వారసుల మీద కుట్ర జరుగుతోందన్నారు. మాలలు గత కొన్ని సంవత్సరాలుగా దళితుల హక్కుల కోసం పోరాటం చేస్తుంటే, మందకృష్ణ మాదిగలకు మద్దతు పలుకుతూ అంబేద్కర్ వారసులను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా దళిత ఉద్యమాల్లో ఉండి దళితుల హక్కుల కోసం ఎనలేని పోరాటం చేసిన మాల సామాజిక వర్గానికి చెందిన కత్తి పద్మారావు, గద్దర్, గోరేటి వెంకన్న, బొజ్జా తారకం వంటి గొప్పవారు ఉండగా దళితుల మధ్య చిచ్చు పెట్టి తమ స్వార్థ ఆర్థిక ప్రయోజనాల కోసం పని చేస్తున్న మంద కృష్ణకు కేంద్రం పద్మశ్రీ అవార్డు ఇవ్వడాన్ని మంగరాజు తప్పుబట్టారు. స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో బాబూ జగ్జీవన్‌రామ్‌ను అడ్డు పెట్టుకుని అప్పటి కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్‌ను అవమానించారనీ, ఇప్పుడు మందకృష్ణను అడ్డుపెట్టుకుని రాజ్యాంగాన్ని తుంగలోకి తొక్కి ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు తీసేయడానికి కుట్ర చేస్తున్నారని మంగరాజు విమర్శించారు. ఈ సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర నాయకులు బుడితి భీమారావు, తరపట్ల మోహనరావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సామాజిక తనిఖీ సభ



విద్యార్థులతో మాట్లాడుతున్న సామాజిక తనిఖీ బృందం

పాలకొల్లు అర్బన్: మండలంలోని శివదేవునిచిక్కాల జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలోనే ఉండి రికార్డులు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నిర్వహణ తీరు, నాణ్యత పరిశీలించారు. పచ్చదనం, పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం, పాఠ్యాంశాల బోధన తదితర వివరాలు తెలుసుకున్నారు. పాఠశాల హెచ్ఎం పి.రాము అధ్యక్షతన అసెంబ్లీ సమావేశం నిర్వహించారు. సామాజిక తనిఖీ అధికారులు కె.రామకృష్ణ, టి.మారెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు వీఎస్ఎన్ మూర్తి, ఎ.సత్యనారాయణ, విద్యాకమిటీ చైర్మన్ తాడి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన



ర్యాలీ చేస్తున్న అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

పాలకొల్లు అర్బన్: ద్విచక్రవాహనాలను నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, దీని వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి అన్నారు. శ్రీఅద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ రూల్స్ ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని పట్టణంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.రామకృష్ణ, డా. వి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం

పెనుగొండ: స్థానిక నగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలోనూ, వాసవీ శాంతి ధాంలో నిర్వహించబోయే వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవంలో పాల్గొనడానికి వస్తున్న సీఎం చంద్రబాబు రాకకు ఏర్పాట్లును జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం ఆజ్మీలు మంగళవారం పరిశీలించారు. ఈ నెల 31న అమ్మవారికి పట్టు వస్త్రాలను సీఎం చంద్రబాబు సమర్పించనున్నారు. పెనుగొండ ఏఎంసీ హెలీప్యాడ్‌ను, ఆలయం వరకూ రహదారిని, రక్షణ ఏర్పాట్లు పరిశీలించారు. హెలీప్యాడ్ చుట్టూ ఉన్న పొదలు తొలగించి శుభ్రం చేయాలని ఆదేశించారు. అనంతరం మూలవిరాట్ ఆలయాన్ని పరిశీలించి పూజలు నిర్వహించారు. హోమాల నిర్వహణ ప్రాంతాన్ని, అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థాంను, భారీ పంచలోహ విగ్రహాన్ని, పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, డీఎస్పీ డాక్టర్ శ్రీ వేద, జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖాధికారి ఈవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

భీమవరం: పేదలకు ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇస్తామన్న ప్రభుత్వ హామీని తక్షణమే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ భీమవరం యానాదుల కాలనీలో పేదల నుంచి ఇళ్ల స్థలాల అర్జీలు స్వీకరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలాలు ఇస్తామన్న హామీని అమలు చేయకపోవడంతో పేదలు సొంత గృహాలు లేక అద్దె ఇళ్లల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు వైవీ ఆనంద్, ఎం.లక్ష్మీపతి, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ అప్లికేషన్స్ సబ్జెక్టులో కాంట్రాక్టు అధ్యాపక పోస్టు నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ డా.టి రాజరాజేశ్వరి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ డిగ్రీ కలిగి 55శాతం ఆ పైన మార్కులు ఉండాలని, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానం ద్వారా బోధించ కలిగే అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను ఫిబ్రవరి 5లోగా కళాశాలలో అందజేయాలని సూచించారు. 6వ తేదీ ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకి హాజరుకావాలని కోరారు.

డ్రోన్ వినియోగంతో ఖర్చు ఆదా



పాలకొల్లు అర్బన్: రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు



పెనుగొండ: ములపర్రులో రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు

పాలకొల్లు అర్బన్: వరి పైరుపై చీడపీడలను పోగొట్టుకోవడానికి డ్రోన్ సహాయంతో పిచికారీ చేస్తే ఖర్చుతో పాటు సమయం కూడా ఆదా అవుతుందని వ్యవసాయ సహాయ సంచాలకులు అద్దాల పార్వతి సూచించారు. మండలంలోని దగ్గులూరు, గవరపేట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. దాళ్వాకు సంబంధించి ఈ-పంట నమోదు ప్రక్రియను ప్రతి రైతూ పూర్తి చేసుకోవాలన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న ప్రతి రైతూ ఎన్‌పీఎస్ఎస్ యాప్ ద్వారా రైతు పొలంలో ఉన్న పురుగులు, తెగుళ్ల ఫొటోలు తీసి పంపిస్తే ఏ మందు పిచికారీ చేయాల్లో సిఫార్సు చేస్తారన్నారు. రైతుల పొలంలో ఆకులు పసుపు రంగులో కనిపిస్తున్నాయని, జింక్ సల్ఫేట్‌ను లీటరుకి 2 గ్రాముల పిచికారీ చేయాలన్నారు. పల్లపు భూముల్లో నీరు పోనటువంటి కాంప్లెక్స్ ఎరువు 20-20-0-13 వేయకూడదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శాగ సత్యనారాయణ, సర్పంచ్ పొలిమేర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: వరిచేలల్లో నీరు ఎక్కువ ఉండడంతో నీటిని తొలగించి చేలు మూన తిరిగిన అనంతరం చిలామిన్ జింక్ లేదా లాబ్ జింక్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం కీటక శాస్త్రవేత్త ఎస్ దయాకర్ అన్నారు. మంగళవారం ములపర్రు, కొఠాలపర్రుల్లో నిర్వహించిన పొలం పిలుస్తోందిలో పాల్గొని పలు సూచనలు చేశారు. అగ్రానమి శాస్త్రవేత్త పీవీ రమేష్ బాబు మాటాక్లడుతూ నత్రజని ఎరువులను అధికంగా వినియోగించడం వల్ల అనర్థాలు జరుగుతాయన్నారు. వీటి వలన పురుగులు, తెగుళ్ల ఉధృతి ఎక్కువగగా ఉంటుందన్నారు. వ్యవసాయాధికారి పి.స్పందన, కె.సంధ్య, పి.సురేంద్రకుమార్ పాల్గొన్నారు.